
PRABHAKAR

"ఏమండీ! లేవండీ! టిఫిన్ రడీ అయింది. కాఫీ చల్లారిపోతోంది" అంటూ రోజూ సుప్రభాతంవలె శ్రీమతి ఎనిమిదవుతున్నా ఏ చప్పుడూ చేయక పోయేసరికి నాకు అనుమానం రానే వచ్చింది ఏదో జరగబోతోందని

లీలగా క్రితంరోజు జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. నిన్న సాయంత్రం మామూలుగానే కారు పార్కుచేసి లోపలకు రాగానే శ్రీమతి ఎదురైకోటు తీసుకెళ్ళి హేంగర్‌కి తగిలించి, వస్తూ స్వీటు, హాటు వెంట తెచ్చింది.

మంచి ఆకలిమీద ఉన్నానేమో టిఫిన్ రెండు నిముషాల్లో ముగించి కాఫీ అందుకున్నాను. యిక శ్రీమతి అందుకుంది.

"ఏమండీ!"

"ఊఁ"

"మన పక్కింటి కామాక్షమ్మ పిన్ని లేదూ!"

"లేదూ! ఏమైంది పాపం!"

"ఛ! అదిగాదండీ, వాళ్ళాయన దీపావళికని ఓ చక్కని ప్రెజెంటు తెచ్చారట."

"ఏమిటో అది!"

"షెవరన్ జార్జెట్ చీర అండీ! గోల్డ్ స్పాట్ కలర్‌లో ఎంత బాగుందో!"

"ఆహా! అలాగా!"

"రెండువంద లయిందటండీ నేత, చేత చాలా బాగున్నాయి."

"ఖరీదు యింకా బావుంది!'

"మీ కంతా వేళాకోళంగా ఉంది గదూ! అవునులెండి. నేను ఏది చెప్పినా మీరు పట్టించుకోరు. మీ కేదైనా కావల్సి వస్తే నాల్గుపొగిడి మీ పని చేయించుకుంటారు. మీ మగబుద్ధి పోనిచ్చారు గాదు!"

యిక పురుషజాతిమీద దండెత్తేలా ఉందని నేను గేరుకొంచెం మార్చాను.

"యింతకీ నీ అభిప్రాయం చెప్పావుగాని నీ ఉద్దేశ్య మేదో చెప్పనేలేదు" అన్నాను.

"ఏమీ లేదండీ! ఎలాగూ నైలెక్స్ చీర కొందామనుకున్నాం గదా! యింకో వంద పెడితే చీర వస్తుందిగదా అని. అదీగాక యిప్పుడు అంతా నగలు, చీరలు, చెప్పులుకూడా గోల్డ్‌స్పాట్ కలర్‌లో వాడుతున్నారండీ!'

"యింతేనయం! జనంఅంతా గోల్డ్ స్పాట్ మాత్రమే తాగుతున్నా రనలేదు! అయినా ఈ పిచ్చేమిటో నా కర్థం గాదు! యివ్వేళ గోల్డుస్పాట్ కలర్‌ఫాషన్ అంటారు. రేపు కోకాకోలా కలర్ ఫాషన్ అంటారు."

"అవునులెండీ! మీ కిష్టం లేకపోతే ఏదైనా అంటారు."

"అదికాదు గీతా! నా కిష్టం లేకపోవటం అన్న ప్రసక్తే లేదు! చెల్లారామ్ షాపు అంతా తెచ్చుకొని మనింట్లో పెట్టుకోవాలని ఉంటుంది. కాని వీలవుతుందా! యిదీ అంతే!"

"ఎందుకు వీలు గాదు! పక్కింటి గుమస్తా పెళ్ళాం కొనుక్కోగా లేంది నాకు కొనుక్కునే అర్హతలేదా!"

"అతనికి జీతం డబ్బులకంటే పై సంపాదన ఎక్కువ. అదీగాక అందిన చోటల్లా అప్పులు చేస్తుంటాడు. స్కూటరు ఉన్నప్పుడు వందల్లో అప్పు చేసేవాడు. యిప్పుడు కారు కొన్నాడుగా! వేలల్లో అప్పులు చేస్తున్నాడు. నన్ను గూడా అలాగే చేయమంటావా! చెప్పు! యిప్పుడే బయలుదేరుతాను" అంటూ చెప్పులు వేసుకోబోయాను.

"వద్దులెండి! ఒక్కచీర కొనమంటే పదిమాటలు అన్నారు. నాకు చీరవద్దూ! చట్టుబండలూ వద్దు" అని రుసరుసలాడుతూ లోపలి కెళ్ళబోయింది.

"అదిగాదు గీతా! నువ్వు పరిస్థితి అర్థంచేసుకోవే! యిప్పుడు రెండువందలు పెట్టి చీర కొన్నాననుకో, మన బడ్జెట్ అంతా తారుమారయి లోటుబడ్జెట్ అవుతుంది! యింకోసారి తీసుకుందాం గదా!" అని బ్రతిమాలబోయాను.

నా చెయ్యి విసురుగాతోసి లోపలి కెళ్ళింది.

* * *

ఫ్లాష్‌బాక్ అంతా గుర్తుకొచ్చాక శ్రీమతిగారు కోపగృహ ప్రవేశం చేసి ఉంటారని గ్రహించాను. పరిస్థితి ఏ స్థితిలో ఉందో చూద్దామని లేచి వంటయింటి కెళ్ళాను. టిఫిన్ కాదుగదా కాఫీ అయినా కాచిన సూచనలేమి కన్పడలేదు. పరిస్థితి విషమంగానే ఉన్నదనిపించింది.

గతంలో రెండు మూడుసార్లు కోపగృహ ప్రవేశం చేసినా టిఫిన్. కాఫీ గట్రా రెడీచేసి మరీ వెళ్ళేది ఎంత చెడ్డా మొగుడు గదా! అని. (ఎంతయినా భారత స్త్రీ గదా!)

"కాఫీ అయినా పడందే బతిమాలడానికి ఓపిక రాదే! అయినా ఏంచేస్తాం!" అనుకొంటూ కోపగృహానికి బయలుదేరాను.

బెడ్ రూమ్, డ్రాయింగ్ రూమ్ కాక స్పేర్‌గా ఉన్న గదినే మా ఆవిడ కోపగృహంగా వాడుకుంటోంది.

లేకపోతే రాజులకిమల్లే కోపగృహం 'ప్రేమగృహం' అంటూ నే నెక్కడ కట్టించను!

నే వెళ్ళేసరికి చీకటిలో పూర్తిగా దుప్పటి ముసుగు కప్పుకొని పడుకుంది. లైటు, ఫాన్ వేసి నెమ్మదిగా దుప్పటి తీయటానికి ప్రయత్నించాను. అది

గ్రహించి ముసుగు యింకా ?గించింది గీత.

నేను యింకా గట్టిగా ప్రయత్నించాను. ఆ పెనుగులాటలో నేను ఓంగువి ఉన్నానేమో. గీతకాలు నా మ ?టికి తగిలింది. వెంటనే గీత దుప్పటి అవతల పారేసింది.

నాకు ఉవ్వెత్తుగా కోపం వచ్చింది. కాని గీత భయంగా, బాధగా నా వేపు చూస్తుంటే నేను నవ్వేశాను. గీత నన్ను కౌగలించుకొని ఏడ్వసాగింది.

"ఛీ! ఊరుకో గీతా! భార్య భర్తల మధ్య యీ మాత్రం ప్రణయ కలహాలు లేకపోతే మజా ఏముంటుంది అయినా నువ్వుచేసిన తప్పేముంది! ఆ నాడు శ్రీ కృష్ణుడికి జరిగిన సత్కారమే యీ నాడు నాకు జరిగింది. యీ విషయంలోనైనా నన్ను శ్రీ కృష్ణుడితో పోల్చుకునే అవకాశం వొచ్చింది. అందుకు కృతజ్ఞత" అంటూ ఆమె కన్నీరు తుడిచాను.

"అనవసరంగా మీ మనసు నొప్పించాను. అయినా పండుగకు బంధువులు వాళ్లు వస్తారు! బోలెడుఖర్చు ఉంటుంది. యిప్పుడు చీర వద్దులెండి" అంటూ యింకేవో డైలాగులు వేయబోయింది.

"ఖర్చులు మన కెప్పుడూ ఉండేవే. అందుకని ముచ్చట్లు మానుకొంటామా! సాయంత్రం బజారుకి వెళ్ళి నీకు కావలసిన చీర కొందాం. యికనైనా అలుక మాని యీ దీనుడికి కాస్త కాఫీనీళ్ళు పోస్తావా" అంటూ చేతుల జోడించి అడిగాను,

"అయ్యో పాపిష్టిదాన్ని! పొద్దున్నే మిమ్మల్ని యిబ్బందిలో పెట్టాను. క్షణంలో యిస్తాను. ముఖం కడుక్కురండి" అంటూ వంటయింటివైపు దారి తీసింది గీత.

* * *

రాత్రిపూట అయితే కలర్ సరిగ్గా తెలియదని సాయంత్రం నాల్గింటికి బజారుకి బయలుదేరదీసింది.

యిద్దరం కలసివెళ్ళి నగరంలోని నాల్గు పెద్దషాపులు తిరగదీశాం. అదేంఖర్మమో 60 రకాల చీరెలు చూపినా ఒక్కటీ నచ్చలేదు మా ఆవిడకి. రంగు నచ్చితే డిజైను నచ్చదు. డిజైను నచ్చితే గుడ్డ నాణ్యం నచ్చదు. అన్నీ నచ్చితే ధర నచ్చదు. పక్కింటి కామాక్షమ్మ పిన్ని కొన్న చీరలాంటిదే కావాలి అని పట్టుదలగా ఎంత తిరిగినా దొరకలేదు. చివరకు రెండువందల యాభై రూపాయలలోనానవే చీరనచ్చితే తీసుకోమన్నాను.

అయినా ఏదీ నచ్చలేదు. ఇంక చేసేది లేక ఉసూరుమంటూ యింటికి తిరిగి వచ్చాం.

గీత దిగులుగా కనిపించింది. తిరగటంవల్లకంటే చీర దొరక్కపోవటం వల్లే ఎక్కువ దిగులుపడ్డట్టు అనిపించింది.

ఏదో ఒకటి చెప్పి ఓదార్చకపోతే రాత్రికి ఫుడ్ కూడా మానేస్తుందని భయమేసింది.

"ఎల్లాగూ వారం పది రోజుల్లో నేను బెనరస్ వెళ్ళాల్సిన పని ఉంది. అక్కడ చవగ్గా దొరుకుతాయి. మంచివి దొరుకుతాయి అందుకని నీకు చీర అక్కడే తీసుకొస్తానులే." అని చెప్పి ఓదార్చాను.

* * *

నేను బెనారస్ వెళ్ళిన నాల్గురోజులకు పని పూర్తయింది. అంతవరకు చీర విషయం గుర్తుకు రాలేదు. ఆ రాత్రికి తిరుగుప్రయాణం పెట్టుకున్నాను.

ఏమీ తోచక బజారుకెళ్ళాను. ఎవరో గోల్డుస్పాట్ కలర్ చీర కట్టుకొని వెళుతూంటే చటుక్కున నాకు చీర సంగతి గుర్తుకొచ్చింది.

ఆ అమ్మాయికి మనసులోనే థాంక్స్ చెప్పుకొని చీరకోసం వేట ప్రారంభించాను.

అదృష్ట వశాత్తు మా ఆవిడ కోరిన కలరు. డిజైను. బోర్డరు ఉన్నచీరె దొరికింది. కాని ధర రెండువందల పైగా ఉంది. అనుకోని ఖర్చులు తగలటంవల్ల తెచ్చిన డబ్బు ఎక్కువ మిగల్లేదు. ఆ పరిస్థితులలో అంత ఖరీదుపెట్టి కొనటంఎలా!

అందుకని తక్కువధరలో చీరకోసం ప్రయత్నించాను. ఎక్కడా దొరకలేదు.

యిక చేసేది లేక తిరుగుముఖం పట్టాను.

యింటికి జేరగానే గీత సూటుకేసు తెరచి వెదకి చీర ఉన్న పాకెట్ బయటకి తీసింది.

చీరతీసిచూసి ఎంతో మురిసిపోయింది. కలర్! డిజైన్. బోర్డరు ఎంతో బాగున్నాయని మెచ్చుకోంది. కామాక్షమ్మ పిన్ని చీరెకంటె కూడ బాగున్నదని పొగిడింది. అంతటితో ఊరుకోక పక్కింటి ఆవిడకి చూపించి "మా వారు బెనారస్‌నుంచి తెచ్చారు అని సగర్వంగా చెప్పుకుంది. ఆవిడకూడ చీర చక్కగా ఉందని ఒప్పుకుంది, రెండువందలకు తక్కువ ఉండదని సర్టిఫికెట్ ఇచ్చింది.

అంతటితో మా ఆవిడలో యిన్నాళ్ళు కాపురంచేసిన దిగులూ. దిరసం. విరుత్సాహం అన్నీ మాయమైపోయాయి.

లోటుబడ్జెట్ కాకుండా మా ఆవిడకు వచ్చిన చీర కొన్నానని నేను సంతోషించాను.

కోరినచీర దొరికిందని మా ఆవిడ సంతోషించింది.

కాని ఉన్నఊళ్లోనే నూట యాభై రూపాయలకు నేను ఆ చీరె కొన్నసంగతి మా ఆవిడకు తెలిస్తే! *